# అయ్యో పాపం!!!

'మంచినీళ్లయినా యివ్వని మాయసంఘం'

"శునిచైవ శ్వపాకేచ పండితాః సమదర్శినః"

ఆర్యా! నమస్కారములు. ఈకథ స్వానుభవముతో వ్రాసిన 'అస్పృశ్యతా పాపము'నకు సంబంధించినది. నేటివరకు అమలులోనున్న ఆచారములచే మాకు అక్కడక్కడా గలుగుచున్న అవమానాగ్ని హృదయము దహించి వేయగా ఇది వ్రాసితిని. నేనొక హరిజనయువతిని.

అవి మంచిరోహిణిగాడ్పులు. పగలు పదిగంటలు దాటితే రైళ్ళలో ప్రయాణంచేస్తూన్న ఫస్టు సెకండు క్లాసు ప్రయాణీకులు కూడా హడలిపోయే రోజులవి. ఆకాశాన్నుంచి చండభానుడు నిప్పులు గ్రుమ్మరిస్తున్నాడు. ఆమండుటెండలకి వృక్షాగ్రాల నివసిస్తూన్న ఎన్నో గబ్బిలాలూ పక్షులూ విగతజీవులై నేలబడి పోతున్నాయి.

కలిగినవాళ్లు వట్టివేళ్లతడకల్లో ఐస్‌క్రీమ్ పానం చేస్తూ చలువపన్నీరూ మంచిగంధమూ, పూసుకుంటూ హాయిగా మేడల్లోనుంచి బయటకు తొంగి చూట్టానికైనా అవసరంలేని మంచిరోజులవి. ఇక గుప్పెడి పొట్టకూటికి ఎండనక, వాననక నానా బాధలూ పడుతూండే పేదవాళ్ళసంగతో?—

## 2

ఇల్లాంటి భయంకరపురోజుల్లో బయలుదేరారు. అన్నపూర్ణా భాస్కరులు-హరిజనయువతీయువకులు-దంపతులు, చాలాదూరాన్నున్న వూళ్ళో అన్నపూర్ణ పుట్టింటివద్ద తల్లి విషజ్వరంతో ప్రమాదంలో వున్నట్టూ-ఏకపుత్రికైన అన్నపూర్ణను చూట్టానికి అస్తమానాలు ఆలాపిస్తూన్నట్టూ వుత్తరంరాంగానే తొందరగా బయలుదేరారు.

చివుకూ చింతావల్ల తెల్లవారి 6 గంటలకి కాస్త కాస్త చల్దిగంజి త్రాగారో లేదో పాపం! తొందరగా ప్రయాణం సాగించారు. వెళ్లవలసింది బహు దూరం. బారెడు ప్రొద్దెక్కిందో లేదో, అప్పుడే వేడి గాడ్పులు విసిరిసిరి తోలుతున్నాయి. రైలుమీదో మోటారుమీదో వెళ్లొచ్చుగాని, ఏపూటపాటు ఆపూట పాపాటుకే చాలక బాధపడుతూన్న యీ హరిజనదంపతులకి ఆసుఖమెల్లావస్తుంది. వాళ్ళ కే భాగ్యమూలేదు. ఉన్నదల్లా ఒకళ్ళనొకళ్ళు ఎప్పుడూ విడిచివుండలేని అద్వితీయ ప్రేమభాగ్యమూ ఏదో ఒకమాదిరి ప్రపంచజ్ఞానం తెలిసికోదగ్గ అయిదో క్లాసువరకూ చదువుకున్న విద్యాభాగ్యమూ తప్ప.

## 3

అప్పుడే యించుమించు పది పదిహేను మైళ్ల వరకూ నడిచొచ్చారు. మార్గమధ్యంలో అక్కడక్కడా వడదెబ్బకు ఆలసిసొలసి పడుతూన్న ఒకళ్లిద్దరు అభాగ్యపు పాంథుల్నిచూచి జాలిపడుతూ అన్నపూర్ణాభాస్కరులుకూడా అలసిపోయారు. చెమట యిద్దరిగుడ్డల్నీ తడిపేసింది!! క్రిందకాళ్లూ పైననెత్తీ మండిపోతున్నాయి.

మొగాలు కందగడ్డలై పోయాయి. నాలుకల మీద తడిలేదు. గొంతెండుకపోయింది. నీడా— నీళ్లూ వీటికోసం తహతహ లాడిపోతున్నారు. గ్రుక్కెడు మంచినీళ్ళున్న గుంటకోసం అటూ-యిటూ వెతుక్కుంటూ నడుస్తున్నారు.

౪

బాట ప్రక్క నే పెట్టించారు చల్లని చలివేంద్రం దగ్గరవున్న వూళ్లో కరణాలందరూ కలసి పుణ్యం వస్తుందని. నిమ్మరసం కలిపిన చల్లని మజ్జిగతో నిండి వున్న బానలు వరుసలు దీర్చి పందిట్లో పెట్టివుంచారు. దగ్గరగా వున్న బల్లమీద తళతళలాడుతూ పది పన్నెండు గ్లాసులున్నాయి. చల్లని మజ్జిగకంపు దూరాన్నుంచి వస్తూన్న తృషాతురుల్ని ఆహ్వానిస్తూంది. ఎదురుగా వున్న యింకో పందిట్లో తాటాకుల చాపలు పరిచివున్నాయి పథికులు కూర్చుని మార్గాయాసం పోగొట్టుకుంటానికని. వచ్చినవాళ్ళు తృప్తి దీరా దాహం త్రాగగానే ఒక్కొక్క విసనకర్ర చేతికిచ్చి కూర్చోపెట్టున్నాడు — చలివేంద్ర నిర్వాహకుడు, కుండబొజ్జా — యజ్ఞోపవీతమూ — విభూతి పెండికట్లూ — ఆతడు బ్రాహ్మడే.

దూరాన్నుంచి ఇదంతా చూచారు. అన్నపూర్ణ ప్రాణం లేచివచ్చినట్లయింది వాళ్ళకు. పరమసంతోషంతో దగ్గరగా వచ్చారు. నోటమాటలు స్ఫుటంగా "ఎవరుమీరు?" అన్నాడు బ్రాహ్మడు. ఈమాట వినగానే నడుము విరిగినట్లయింది భాస్కరుడికి. "మాలాళ్ళమండీ" అంది హీనస్వరంతో అన్నపూర్ణ. "చాలుచాలే ప్రక్కకు తప్పుకుని మరీ మాట్లాడండి!! దారికి అడ్డంలెండి గొప్పగొప్పవారు వచ్చిపోతున్నారు. ఇక్కడ మాలముండాకొళ్ళకి దాహమిస్తారు. మాకు మైలగాదూ మీకు నీళ్లోస్తే!! పంపిరి తాక పోకండి" అన్నాడు ఛీకరంగా బ్రాహ్మడు.

"గంటగంటకీ, 'కాఫీ టీ లూ — 'సోడా లైం జూస్ లూ, త్రాగుతూ, కారులో కాలు క్రింద పెట్టిందేతడవుగా, గొడుగునీడల్ని నడచేవాళ్ళందరికీ, పిలిచి బలవంతంగా — దాహమిచ్చేకంటే, మా బోటి నోరెండి ప్రాణాలు పోతూన్నవాళ్ళకిస్తేనే మీకు యెక్కువ పుణ్యం గాదా బాబూ — గుక్కెడు —" అంది అన్నపూర్ణ కంపితకంఠంతో —

"నోరుముయ్యి. ఇక్కడ మాట్లాటానికి వీల్లేదు. మీవంటి చండాలపాళ్ల కోసం పెట్టిందిగాదిది!! అల్లా వూళ్లోకపొండి — పొమ్మంటేపోరేం — బుద్ధిలేదూ మీకూ" అని కసురుతూ గద్దించాడు బ్రాహ్మడు, నిలబడ్డానికేనా వీల్లేకుండా —

మొగాన్ని అర్ధణా కాసంత కుంకుమబొట్టూ — ఎర్రటి పట్టుచీరా — చేతినిండా గాజులూ — మెళ్ళో పట్టెడు మంగళసూత్రమూ — ఎత్తుపీటమీద కూర్చుని వుండి — బ్రాహ్మణముత్తైదువ — చల్లని మంచినీళ్ళ గంగాళం ముందుపెట్టుకుని, అగ్రహారపు పెద్దవీధి మొదట లోగిట్లో. ప్రతియేటా వేసంకాలం నాలుగు నెల్లూ, ఆయిల్లాలు తనలోగిటిముందువలో అడిగినవాళ్లకు లేదనకుండా శుద్ధిదాహమిస్తూవుండటం రివాజు

ఊళ్ళోకేనా వెళ్లి తనివిదీరా దాహము త్రాగుదామనుకుంటూ — పెదిమలు చప్పరించుకుంటూ వచ్చి చేరుకున్నారు యీ మొదటియింటికి — అన్నపూర్ణా భాస్కరులు. వీధిగుమ్మంలో నిలబడి "గుండె ఆరుకుపోయింది గుక్కెడు మంచితీర్థము యిప్పించమ్మా!" అని కేకేశాడు భాస్కరుడు.

చెంబులో నీళ్ళూ — గ్లాసూపట్టుకుని తొందరగా ఈవలకువచ్చింది. "ఎవరుమీరు నాయనా — అగ్గి గొట్టి ఆలసిపోయినట్టున్నారూ" అంటూ ఎంతో ఆదరణగా దగ్గిరికొచ్చింది యిల్లాలు —

మంచినీళ్ళు కోరికాయగనా ఆవేశానందంతో — "మాలాళ్లము తల్లీ — యిల్లాపొయ్యించండి" అంది ఆప్యాయంగా — అన్నపూర్ణ.

ఆమాటవినగానే చటాలున వెనక్కితగ్గి "ఏమర్రా! ఇంతమోసం చేశారూ!! — చూచవచ్చివాళ్ళమని ముందే యేడవొద్దూ? — ఇది అగ్రహారమనుకున్నారా — మరోటా? ఎంతవిడ్డూరమొచ్చిందర్రా!! — పాడుకాలం! పోపొండి! ఇక్కడెక్కడా నీళ్లుదొరకవు — ప్రక్కవూరికిపొండి!! —" అని గుక్కతిప్పకుండా అనేసి, చటాలున తలుపుమూసి లోనికిపోయింది. నిలువునా చచ్చిపోయి ముందుకు బయలుదేరారు — భాస్కరదంపతులు.

౫

"ఈవేళ పెట్టనిరోజా గాబోలు, పురిసెడి మంచినీళ్ళే కరువయ్యాయి" అంది మెల్లగా అన్నపూర్ణ. "అ


268

మాటలేమీ నేనొప్పుకోను:—పెట్టనిరోజులనీ-పూర్వ కర్మఫలితాలనీ, యీదొంగవేదాంతాలన్నీ మనకోసమే కల్పించా రీభాగ్యవంతులంతా-మనరక్తమాంసాలన్నీ బాగా పిండుకుని, మనకు మంచినీళ్ళైనా దొరక్కుండా చేస్తూన్నందుకు, మనము నోరుమూసుకుని వూరుకోడానికి!! యిల్లాంటి పిచ్చిమాటలు నమ్మబోకు అన్నపూర్ణా" అన్నాడు భాస్కరుడు.

ఇల్లాగే యేమేమో గొణుక్కుంటూ, మొగాలు వ్రేలవేసుకుని ఓపిక లేక-వకళ్ళ చేయివకళ్ళుపట్టుకుని నడుస్తున్నారు. వేడిగాడ్పులకు ప్రతియింటితలుపులూ మూసివున్నాయి. ఎవ్వరినేనా గుక్కెడు మంచినీళ్లు అడుగుదామని మెల్లగా నడుస్తున్నారు.

మేడపై అంతస్తుమీదున్న విలాసిని, వీధంట వెళుతూన్న మాలదంపతుల్ని కిటికీగుండా చూచింది.

"ఎవ్వరో చాలానీరసంగా గాడ్పులలోబడి నడుస్తున్నారు—పార్వతీపరమేశ్వరుల్లాంటి దంపతుల్లాగున్నారు. ఈరోజు అతిథి పూజా భాగ్యమన్నా మనకు దక్కుతుంది-అల్లావెళ్ళి వారిసంగతి కనుక్కుని యిటు తీసుకరారా" అని చెప్పిపంపిం దావిలాసిని-ఎంతో జాలితో నౌకరిని.

నౌఖరువచ్చి సంగతంతా తెలిసికొన్నాడు. 'మైల మైల' అని అరుచుకుంటూ పరుగెత్తి యజమానికి మనవిచేశాడు. ఆవిడ మండిపడి "నేనుపుట్టి బుద్ధి తెలిశాక అగ్రహారప్రవీధుల్లో మాలమాదిగాళ్ళు నడవటమే చేసెరగను-పైగా మంచినీళ్లే కావాలన్నారూ, వాళ్ళు? విపరీతంగావుందే?—ఒరే! ధప్పున వెళ్ళి ఆ దేబెలను వూరిబయటకంటా తోలేసిరా" అని ఆజ్ఞాపించింది.

యమభటుల్లావచ్చి ఏమండ్రోయ్-ఇదిబ్యామ్మల పుట్టని తెలీదూ-పోపాండ్రావలకీ-దామానికీలేదు గీమానికీలేదు" అంటూ రుద్దుగర్ర యిద్దరి మెడమీదా వేసి వూరిబయటకంటా నెట్టేశాడు-చాకలినౌఖరు దయాదాక్షిణ్యాలు విడిచేసి!!—

## ౬

వడమటగాడ్పుకి కొనవూపిరితోవున్న అన్నపూర్ణ, ఈనౌఖరి గెంటులకి మరీఆలసిపోయింది. వూరిబయట పదిపన్నెండుగజాలదాకానడిచి, స్మృతి దప్పి పడిపోయింది. 'బావురు'మని యేడ్చాడు భాస్కరుడు, పాపం! యేంజేస్తాడు. మెల్లగా దగ్గరగావున్న చెట్టుదగ్గరకు చేర్చాడు అన్నపూర్ణను.

"పూర్వమేదో మహాపట్నం పాపభారాన్ని దగ్ధమై 'కొల్లేరై' పోయిందట-అల్లాగవగూడదూ? ఈ అగ్రహారంకూడాను- దేవుడనేవాడొకడుండి చూస్తూవుంటే-భగవంతుడూ భాగ్యవంతులూ ఒకటేనేమో! లేకపోతే యిల్లావూరుకుంటాడా-ఈకటిక వాళ్ల హృదయాల్లో గుక్కెడు మంచినీళ్ళిచ్చే దయాలేశమైనా కలిగించకుండా- ఏవో యిల్లాంటి వూహలతోటే కొట్టుమిట్టాడుతూ చాలు కారుకపోయి వికారంతో భాస్కరుడున్నాడు. ఈ రెండుప్రాణాలూ, యీ పాడుఅగ్రహారపు ఆచారాలకు బలి గాబోలు!!!

## ౭

"ఉస్స-అల్లాహో అక్బర్" అనుకుంటూ, చేత్తో మరచెంబుపట్టుకుని వెళుతున్నాడు అయాసంగా.—సాహేబు తొందరపనిమీద; దూరాన్నుంచే చూచేడీ దృశ్యం; గబగబా చెట్టుదగ్గరకువచ్చాడు. "ఏమీ భాయీ-బీబీపడీవుందీ- మాయ్యడికీ దబ్బా- థలే-తగిలిందా భాయ్" అంటూ ధప్పున మరచెంబుమూత విప్పి గ్లాసెడునీళ్ళు అన్నపూర్ణ మొగాన్నిగొట్టి, కొంచెంనీళ్ళు నోట్లోపోశాడు. నీళ్ళుదప్పరించి గుటక వేసి కొంచెం కళ్ళుతెరిచింది. గ్లాసెడునీళ్ళు నోటి కందించాడు. 'గటగటా' త్రాగి తెప్పరిల్లింది. మిగిలిన నీళ్ళన్నీ భాస్కరుడికిచ్చాడు. ఇద్దరూ కొంచెం తేరుకున్నారు.

"థలేదగ్గిరా- వూరూవుండింది- పానీకీ ఇంతా కష్టం ఎందుకీ భాయ్" అన్నాడు సాహేబు ప్రాణదాత.

"మేము మాలాళ్ళం, అనంతా మంచినీళ్ళయినా యివ్వని మాయసంఘం, బాబూ!" అన్నారు ఏక కంఠంగా గద్గదికతో—అన్నపూర్ణాభాస్కరులు చేతులు జోడించి—

గొట్టుముక్కల మంగాయమ్మ.